క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు టీచర్ ఎంపిక


జంజనం వెంకట నాగశాంత

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జంజనం వెంకట నాగ శాంత ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎంపికైంది. బ్రిటీష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కనెక్ట్ కాంపిటేషన్- 2023 లో పాల్గొని విజయం సాధించిన ఉపాధ్యాయురాలు ఈ నెల 3,4 తేదీలలో అస్సాం రాష్ట్రం గౌహతిలో నిర్వహించనున్న ఏఐఎస్‌ఐటి ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. గతంలో ఉపాధ్యాయురాలు జీర్జ మాషన్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా నుంచి వచ్చిన నగదు ద్వారా టీచింగ్ ఇంగ్లిష్ టుయంగ్ లెర్నర్స్‌లో సర్టిఫికెట్ సాధించింది. ఉపాధ్యాయురాలు నాగశాంత పాఠశాల హెచ్‌ఎం శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

లబ్ధిదారులకు రిజిస్టర్ డాక్యుమెంట్లు అందజేత



ఫిరంగిపురం: నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు మంజూరు చేసిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ పద్మనాభుడు తెలిపారు. దానిలో భాగంగా మండలంలోని 18 గ్రామాల్లో 1,377మందికి ఇచ్చిన ఇంటి స్థలాలకు ఆన్‌లైనులో వారి పూర్తి వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి వివరాలు నమోదు చేసి రిజిస్టర్ డాక్యుమెంట్లు నుదురుపాడు గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు, మేడికొండూరు మండలానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడికొండూరు తహసీల్దార్ శ్రీనివాసశర్మ, డీటీఓ శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్ నాగేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి

తాడేపల్లిరూరల్: బాలికలు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని, ఆత్మస్థైర్యమే నిజమైన బలమని కేఎల్‌యూ విశ్వవిద్యాలయ ఎన్‌సీసీ 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ వి. మౌనిక అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8,9,10 తరగతుల బాలికలకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. మౌనిక మాట్లాడుతూ బాలికలు ఎక్కువ ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని, పాఠశాలకు రాకపోకల సందర్భంలో గాని మరేదైనా ఇతర సమయాల్లో అపరిచితుల నుంచి ఏవైనా ఆపదలు వచ్చినప్పుడు ఆత్మరక్షణ నైపుణ్యం ఉపయోగించి తమను తాము రక్షించుకోవాలని సూచించారు. అనంతరం విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు బాలికలకు శిక్షణ ఇచ్చారు. పదో తరగతి పూర్తయిన తరువాత ఉచితంగా ఉన్నత చదువులు ఎలా చదవాలనే అంశాలపైన, ఏపీఆర్‌జేసీ, పోలీసెట్‌ల వంటి పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనే అంశాలపైన క్యాడెట్లు బాలికలకు అవగాహన కల్పించారు.

దుగ్గిరాల మండలంలో కుల గణన పూర్తి



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని చింతలపూడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన పూర్తి అయింది. బుధవారం గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కుసుమశ్రీదేవి చింతలపూడిలో కుల గణనను పరిశీలించారు. తొలుత గ్రామంలో పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పూర్తి అయిన కుల గణన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంపీడీఓ దీప్తికి సన్మానం



తాడికొండ: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని తాడికొండ ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. తాడికొండ ఎంపీడీఓగా పనిచేసి బదిలీ కృష్ణా జిల్లాకు వెళుతున్న అత్తోట దీప్తి సత్కార సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మండలంలో ఎంపీడీఓగా వచ్చిన అనతికాలంలోనే అన్ని విధాలుగా అందరికీ తనదైన శైలిలో సేవలందించిన ఎంపీడీఓ దీప్తి అటు ఉద్యోగులు, ఇటు ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందారని సూచించారు.


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజలు


సీఎం వైఎస్ జగన్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభిమానులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

జయహో బీసీ

మంగళగిరి పట్టణం జయహో బీసీ నినాదంతో హోరెత్తింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జేజేలు పలికింది. సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బృందంలోని నేతలపై పూలవర్షం కురిపించింది. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని ప్లకార్డులతో ప్రజలు బారులు తీరారు. – తాడేపల్లి రూరల్

సామాజిక సాధికార యాత్ర సక్సెస్

- మళ్లీ సీఎం జగనే అంటూ నినాదాలు
- మంగళగిరిలో పండుగ వాతావరణం
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణం జై జగన్.. జైజై జగన్ నినాదాలతో దద్దరిల్లింది. మళ్లీ సీఎం జగనన్నే అంటూ హోరెత్తించారు.. అడుగడుగునా వైఎస్సార్ సీపీ జెండాలతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చారు. సంక్షేమ రాజ్యం.. జగనన్నతో సాధ్యమంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గంలో అన్ని దారులు మంగళగిరి మిద్దె సెంటర్ వైపే కదిలాయి.

కొత్త బస్టాండ్ నుంచి మిద్దె సెంటర్ వరకు బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. మంగళగిరి రూరల్‌లో పచ్చల శ్యామ్, మాజీ ఎంపీపీ రత్నకుమారి, ఫిరోజ్ తదితరుల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్దకు చేరుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, సామాజిక న్యాయం జరగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఈదులమూడి డేవిడ్ రాజు, ఎండీ ఫెూరే, తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, వడ్డేశ్వరం నుంచి బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), గొడవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీగా జనాలు సభా స్థలానికి తరలి వచ్చారు. దుగ్గిరాల మండల పరిధిలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, లెనిన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్. రత్నం, జిల్లా ఉపాధ్యక్షులువి. రజనీకాంత్ ఆధ్వర్యంలోను, పలు గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సభా స్థలానికి వాహనాల్లో ర్యాలీగా విచ్చేశారు.

జయహో బీసీ అంటూ..

బస్సుయాత్ర ప్రారంభమయ్యే సమయంలో అక్కడకు చేరుకున్న ప్రజలు కోలాహలంగా డ్యాన్స్‌లు చేస్తూ జయహో సామాజిక సాధికార యాత్ర అంటూ నినాదాలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలంటూ నినాదాలు చేశారు. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయంలో దివంగత నేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నాయకుల ఫొటోలతో కూడిన ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

మరోపక్క తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వివేకానంద రెడ్డి, మిరియాల రాంబాబు, అమరా నాగయ్య, నూతక్కి శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి సామాజిక సాధికార బస్సు యాత్ర వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించడానికి నాయకులకు గంట 20 నిమిషాలు సమయం పట్టిందంటే బస్సు యాత్రను ప్రజలు ఏ విధంగా దిగ్విజయం చేశారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే కావాలని, గ్రాఫిక్స్ చూపించే ప్రభుత్వాలు మాకు వద్దంటూ నినదించారు.

ఘనంగా మేరి మాతా ఆర్సీఎం చర్చి వేడుకలు


ఎమ్మెల్యే మేకతోటి సుచరితను సన్మానిస్తున్న ఫాదర్

మేడికొండూరు: మండల పరిధిలోని మేరిమాతా ఆర్సీఎం చర్చి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మేరిమాతా ఆశీస్సులు అందరికి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమతో ప్రార్థన చేసుకుని జీవితం సుఖమయం చేసుకోవాలని కోరారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు దివ్యపూజాబలిలో పాల్గొని మేరిమాతా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, చర్చి ఫాదర్ కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో సమాజాభివృద్ధికి పాటుపడాలి


విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న దేబాశిష్, ఎస్వీ రమణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు మేనేజ్‌మెంట్ రంగంలో రాణించడంతో పాటు సేవా దృక్పథంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఐటీసీ జనరల్ మేనేజర్ దేబాశిష్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన స్ఫూర్తి-ది ఐక్యూబ్ ఎక్స్‌పో బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దేబాశిష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. రూరల్ అండ్ అగ్రికల్చర్ మార్కెటింగ్‌పై ఎక్స్‌పో నిర్వహించిన హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన ఎంబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులతో పాటు వాటర్ సైకిల్, సముద్రం నుంచి క్రూడాయిల్‌ను వెలికితీసే ప్రాజెక్టులను ప్రదర్శించిన హిందూ కళాశాల జియాలజీ విభాగ విద్యార్థులను విన్నర్లుగా ఎంపిక చేసి రూ.ఐదు వేలు చొప్పున బహుమతి అందజేశారు. హిందూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ప్రదర్శించిన బ్యాంకింగ్ స్టాల్, హిందూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల మొబైల్ రివల్యూషన్ స్టాల్‌కు ద్వితీయ బహుమతి రూపంలో రూ.3,500 చొప్పున అందజేశారు. హిందూ పీజీ, బీకాం విద్యార్థుల ప్రాజెక్టులు తృతీయ స్థానంలో నిలిచాయి. మూడో రోజు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎక్స్‌పో తిలకించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎన్. నిషాంత్, డాక్టర్ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి. చక్రవర్తి, కో-కన్వీనర్ డి. కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, వి.బాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎస్. మణికంఠ, బి. అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కేఎల్‌యూకు స్థానం


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించిన జస్వంత్ ప్రసాద్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న వేములపల్లి జస్వంత్ ప్రసాద్ పదివేల రెండు వందల తొంభైమూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ప్రపంచంలోనే ఎత్తయిన లడఖ్ రహదారిలో ప్రయాణించి ఇండియా బుక్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడని తెలిపారు. చిన్నప్పటి నుంచి బైక్ రైడింగ్‌పై ఆసక్తి ఉండడంతో తండ్రి ప్రసాద్ జస్వంత్‌ను ప్రోత్సహించి ప్రత్యేక ట్రైనింగ్ ఇప్పించారని పేర్కొన్నారు. గత సెప్టెంబర్‌లో ప్రారంభించిన ద్విచక్ర యాత్రను విజయవాడ నుంచి లడఖ్ వరకు 29 రోజుల్లో పూర్తి చేశాడని, మధ్యలో కాశ్మీర్, కన్యాకుమారి ప్రాంతాలను కూడా సందర్శించాడని వివరించారు. నవంబర్ నెలాఖరులో జస్వంత్ యాత్ర పూర్తి అయినప్పటికీ ఇండియా బుక్ రికార్డ్ వారు ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో ఇతని వివరాలను జనవరి చివరలో పొందుపరిచారని అన్నారు. ఈ సందర్భంగా ఇండియా బుక్ రికార్డ్‌లో స్థానం సంపాదించిన జస్వంత్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బీబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సిహెచ్ హనుమంతరావు అభినందించారు.

సేంద్రియ వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ


తడిచెత్త- పొడిచెత్త సేకరిస్తున్న బీఎస్ఎస్‌బీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తాడికొండ: సేంద్రియ వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తాడికొండ బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తాడికొండ మండలం బడేపురం గ్రామంలో నిర్వహించిన చెత్త సేకరణ కార్యక్రమానికి పలువురు విద్యార్థులు పాల్గొని చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి తడి చెత్త- పొడి చెత్త సేకరించడంతో పాటు రీ సైక్లింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, ఉపయోగించే విధానం వివరించారు. అనంతరం సేంద్రీయ వ్యవసాయ శిక్షకులు వి.శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి మొక్కలకు వాడే మైక్రో న్యూట్రియంట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సునీత లక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ వేణు బాబు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే ఉన్నతశిఖరాలు


జోజప్పను సన్మానిస్తున్న మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: నిబద్ధతతో పనిచేస్తే ఉన్నతశిఖరాలు అధిరోహించవచ్చని అందుకు నిదర్శనమే పీఆర్ ఏఈ జోజప్ప అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తు పదవీవిరమణ చేసిన పి.జోజప్ప సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సుచరిత మాట్లాడుతూ తాను జన్మించి, విద్యనభ్యసించిన మండలకేంద్రంలో 18 ఏళ్లపాటు వివిధ విభాగాల్లో పనిచేస్తు ప్రజల మన్నన్లు పొందిన వ్యక్తి జోజప్ప అని చెప్పారు. అనంతరం పూలమాలలు,దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, డ్వామా పీడీ ఎం. వెంకట్రామిరెడ్డి, ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈ భానుప్రకాష్, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, సయ్యద్‌హబీబుల్లా, కె.చిన్నప్పరెడ్డి, ఎస్‌కే. అబ్దుల్ గఫార్, జి.చంద్రం, డి.సురేష్, మేడాబాబు, పాలపాటి రఘు, చేవూరి సాంబిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, బి. అంజిరెడ్డి, పి.జోసఫ్, ఎం.సుధాకరరెడ్డి,వి. వీరయ్య, వి.రాము,ఎస్.నాగరాజు, వెంకట్రామిరెడ్డి, ఏ.అనూరాధ, చౌడయ్య,టి.కృష్ణ, పి.చిన్న, కె.రామారావు, పిచ్చిరెడ్డి, జి. కోటేశ్వరరావు, నాగరాజు, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ విలియమ్స్ పాల్గొన్నారు.

విప్రోలో 24 మందికి ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు, కంపెనీ సిబ్బంది

మోతడక(తాడికొండ): విప్రో కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 24 మంది ఎంపికయ్యారని మోతడక చలపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలలో ఆప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లోని విప్రో సంస్థలో పనిచేయాల్సి ఉంటుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు

సామాజిక సేవాతత్పరులు ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సామాజిక సేవా భావాన్ని పెంపొందిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సేవాతత్పరులని ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ''ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు-సామాజిక బాధ్యత'' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ ప్రగతి పథంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల సేవలు మరువలేనివని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేస్తూ స్వామి వివేకానంద, మదర్ థెరీస్సా అడుగుజాడల్లో నడవాలని సూచించారు. వికాస్ హాస్పిటల్స్ సీఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవాభావంతో సాటి మనిషికి సాయం చేసే తత్వాన్ని కలిగిన అధ్యాపకులు దైవంతో సమానమని తెలిపారు. ప్రొఫెసర్ ఎన్‌పీడీ పాల్ మాట్లాడుతూ సేవా దృక్పథం ఉంటేనే ఎన్‌ఎస్‌ఎస్‌లోకి రావాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని, సేవాభావం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జీవీ సుధీర్‌కుమార్, వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి వినతిపత్రం అందజేత



తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం ఆదివాసీ మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అనుముల వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు సురేంద్రతో మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే ఎరుకుల, యానాది తెగల అభివృద్ధి కోసం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, అదేవిధంగా బోగస్ ఎస్టీలను అరికట్టుటకు నాన్ బెయిలబుల్ చట్టం తీసుకురావాలని, కులధ్రువీకరణ కేసులను త్వరితగతిన విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

3న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 3న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీత విభావరి, అనంతరం సభలో మిరాకిల్స్ వరల్డ్ రికార్డు సంస్థ జ్యూరీ సభ్యులుగా ఎంపికైన డాక్టర్ పట్టాభి కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

డెప్యూటీ కమిషనర్- 1గా వెంకటలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ - 1గా డి. వెంకటలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటిదాకా డెప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన బి. శ్రీనివాసరావు సీడీఎంఏ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.